# ధనార్జనపై గర్జన

**న్యూస్‌టుడే, కర్నూలు, నందవరం, ఎమ్మిగనూరు**

**చం**ద్రబాబు మీ కోసం యాత్ర జిల్లాలో ప్రవేశించడంతో తెదేపా శ్రేణుల్లో నూతనోత్సాహం పెల్లుబుకుతోంది. గురువారం మహబూబ్‌నగర్ జిల్లా గద్వాలలో ప్రచారాన్ని పూర్తి చేసుకుని చంద్రబాబు కర్నూలు జిల్లాలో ప్రవేశించారు. సాయంత్రం 6.50 గంటలకు చంద్రబాబు ప్రచార రథం కర్నూలు జిల్లా నాగులదిన్నె గ్రామంలో అడుగుపెట్టింది. సాయంత్రమే అక్కడికి చేరుకున్న జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి, ఎమ్మిగనూరు నియోజకవర్గ బాధ్యుడు బి.వి.మోహన్‌రెడ్డి ఘనమైన ఏర్పాట్లతో స్వాగతం పలికారు. తెలంగాణా కోర్ సమితి సమావేశం పూర్తి చేసుకుని సీనియర్ నేత కె.ఇ.కృష్ణమూర్తి నాగులదిన్నె చేరుకున్నారు. మాజీ మంత్రి కె.ఇ.ప్రభాకర్, ఎం.ఎల్.సి.లు మసాల పద్మజ, శ్రీనివాసులు, బనగానపల్లె, శ్రీశైలం నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు ఎర్రబోతు వెంకటరెడ్డి, బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, పార్టీ జిల్లాశాఖ మాజీ అధ్యక్షుడు సోమిశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు బాబుకు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. మాజీ మేయర్ బంగిఅనంతయ్య పసుపు దుస్తులతో భారీ జెండాలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

### అంతా ఆనందం..

చంద్రబాబు మీకోసం యాత్రలో భాగంగా నాగులదిన్నె గ్రామం చేరుకోగా పచ్చ జెండాలతో ప్రజలు ఘన స్వాగతం పలికారు. మండల కేంద్రమైన నందవరం పసుపుమయమైంది. వేలాదిగా రోడ్ల మీదకు వచ్చి బాబుకు నీరాజనం పలికారు. తప్పెట్లు, మేళతాళాలతో అడుగడుగున ఘన స్వాగతం లభించింది. పసుపు రంగుతో తయారు చేసిన ఎద్దుల బండ్లను చంద్రబాబు కోసం సిద్ధం చేశారు. మంత్రాలయం నియోజకవర్గం నుంచి భారీ జనంతో రాంపురం బాలనాగిరెడ్డి సోదరులు మీ కోసం యాత్రలో కలిశారు. జిల్లా సాంస్కృతిక విభాగం ప్రధాన కార్యదర్శి హనుమంతరావు చౌదరి నాగులదిన్నెలో బాబుకు కుంకుమ పెట్టి స్వాగతం పలుకగా మీ కోసం యాత్ర విజయవంతం కావాలని 102 రోజులు పూజ జరిపారని బైరెడ్డి చంద్రబాబుకు పరిచయం చేశారు.